క్లుప్తంగా

భూముల కొలతలపై విద్యార్థులకు అవగాహన



భూముల కొలతలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: భూముల కొలతలపై విద్యార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలని దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్. మూర్తి తెలిపారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు దిబ్బిడిలో వ్యవసాయ భూముల్లో కి తీసుకెళ్లి వాటి కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దిబ్బిడి హైస్కూల్ హెచ్ఎం సత్యారావు మాట్లాడుతూ బహు భాషా విధానం,సైన్స్, సోషల్,గణిత క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందిస్తున్నామని తెలిపారు.

63 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ: స్థానిక అక్షర విద్యా నికేతన్ స్కూలులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇట్స్ మై విలేజ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 63 మందిని పరీక్షించి, 31 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు బొబ్బిలి మధు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో బొబ్బిలి నవీన్, బొబ్బిలి కిశోర్, సిరికి నాగేశ్, శంకర్ ఫౌండేషన్ వైద్యులు అరుణ, క్యాంపు మేనేజర్ ఎం. అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి హాజరుకావాలి



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాణీశాంతారామ్

గొలుగొండ: నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నివాసంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జరిగే వైఎస్సార్ సీపీ సమావేశానికి పార్టీ శ్రేణులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ విభాగాలు ఇన్‌చార్జులు తప్పకుండా హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్ తెలిపారు. ఈనెల 9 మాజీ సీఎం, వైఎస్సార్‌పీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వస్తున్న సందర్భంగా సోమవారం సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

మెడికల్ కాలేజీ సందర్శనను విజయవంతం చేయండి



దొండా రాంబాబు

బుచ్చెయ్యపేట: నర్సీపట్నం వద్ద గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రానునన్నారని, ఆ పర్యటన విజయవంతం చేయాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు కోరారు. నిర్మాణ పనులను 9వ తేదీన వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అపూర్వపు కలయిక



పాఠశాలలో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల చదువు పూర్తయిన 23 ఏళ్ల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాడు చదువు చెప్పిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు స్వర్ణలత, తులసి, పద్మజ, కృష్ణకుమారి, కులయ్యతో పాటు పూర్వ విద్యార్థులు కోలా మహేష్, ప్రవీణ్, ఎర్రినాయుడు, కండిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ యాతన

- జాగారం గెడ్డ వద్ద రక్షణగోడ నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు
- ఏటా ముంపునకు గురవుతున్న పొలాలు

అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్న ఈ రక్షణగోడను సుమారు 10 ఏళ్ల కిందట నిర్మించారు. అది కూడా అసంపూర్తిగా వదిలేశారు. ఇది గెడ్డ ప్రవాహం నుంచి కొంత రక్షణగా ఉండేది. ఆ తరువాత వచ్చిన తుఫాన్లకు రెండు సార్లు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఏటా వర్షాకాలంలో గెడ్డ పొంగి పంటలు దెబ్బతింటున్నాయి.



గెడ్డలో కొట్టుకుపోగా మిగిలి ఉన్న రక్షణ గోడ



గత ఏడాది సెప్టెంబర్‌లో వరిపొలాలను ముంచెత్తిన జాగారంగెడ్డ

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరు ప్రాంతంలో గల జాగారం గెడ్డతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఏటా వర్షాకాలం, తుఫాన్ల సమయంలో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంటలు మునిగిపోయి నష్టాలపాలవుతున్నారు. జాగారం గెడ్డ వరద నీరు రైతుల భూముల్లోకి వెళ్లకుండా గతంలో రక్షణగోడ నిర్మించారు. దీనిని అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో పదేళ్ల కాలంలో తుఫాన్ల సమయంలో రెండుసార్లు గోడ కొట్టుకుపోయింది. దీంతో పొలాల్లోకి భారీగా నీరు చేరడంతో పాటు ఇసుక మేటలు వేస్తోంది. రైతులు ధాన్యం, ఇతర పంటలను గ్రామానికి తీసుకువెళ్లేందుకు వేసిన మట్టిరోడ్డు కూడా కోతకు గురవుతోంది. ఈ పరిస్థితుల్లో ఏటా వ్యవసాయ ఉత్పత్తులు గ్రామానికి తీసుకువెళ్లేందుకు రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గెడ్డతో ఏటా ఇబ్బందులే..



జాగారంగెడ్డ వల్ల ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు అధికంగా కురిస్తే గెడ్డ ఉధృతికి పొలాలను నీరు ముంచెత్తడంతో పాటు ఇసుక మేటలు వేయడం వల్ల పంటలకు నష్టం కలుగుతుంది.

వేగి నూకరాజు, రైతు, జి.కోడూరు

పూర్తిస్థాయిలో గోడ నిర్మించాలి



పంటలకు నష్టం జరగకుండా జాగారం గెడ్డ వద్ద పూర్తిస్థాయిలో రక్షణ గోడ నిర్మించాలి తాత్కాలిక పనులకు ఖర్చు చేసిన నిధులు భారీ వర్షాలకు నీటిపాలవుతున్నాయి.

తోట చిరంజీవి, రైతు, జి.కోడూరు

పరిశీలనతోనే సరిపెట్టిన అధికారులు

రెండేళ్ల క్రితం గెడ్డ ఉధృతికి రక్షణగోడ కొట్టుకుపోయింది. దీంతో గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు వరిపంట నీటమునిగింది. కొట్టుకుపోయిన గోడతో పాటు నీటమునిగిన పంటను మండలస్థాయి అధికారులు పరిశీలించారు. ఇప్పటి వరకూ కొట్టుకుపోయిన రక్షణ గోడ నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఏటా అవస్థలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో శాశ్వత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చెత్తను తరలించాలని నిరసన

రావికమతం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, హైస్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను తక్షణమే తరలించాలని స్థానిక అంబేడ్కర్ కాలనీ వాసులు, సీపీఎం నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం చేతులు జోడించి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం మధ్యన ఉన్న చెత్తను తరలించాలని ఎంపీడీవో,తహసీల్దార్‌లకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై గత నెల 30 న ఆందోళన చేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తరలించాలని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేతులు జోడించి వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. గోవిందరరావు, కేవీపీఎస్ మండల కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, పంచాయతీ 12వ వార్డు సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తతో ఇక్కట్లు



కాలనీలో డ్రైనేజీ వద్ద తుప్పలు, చెత్త తొలగిస్తున్న స్థానికుడు

మాకవరపాలెం: స్థానిక ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడి డ్రైనేజీల వద్ద చెత్త పేరుకుపోవడంతో పాటు తుప్పలు పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో ఇళ్లలోకి పాములు, విషకీటకాలు వస్తున్నాయని వారు తెలిపారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో తామే తుప్పలు, చెత్త తొలగించుకోవాల్సివస్తోందన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయడంతోపాటు చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.

తుప్పలు.. వాహనచోదకులకు తిప్పలు

మాడుగుల రూరల్: కె.జె.పురం నుంచి మాడుగులకు వెళ్లే దబ్బకుంట రహదారికి ఇరువైపులా తుప్పలు, మొక్కలు భారీగా పెరిగిపోయాయి. పలు చోట్ల అవి రోడ్డుపైకి విస్తరించాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. దీనికి తోడు ఈ రహదారిలో మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలగెడ్డ వద్ద నుంచి తాచేరు నది వరకు రహదారి కిరువైపులా తుప్పలు పెద్ద ఎత్తున ఉన్నాయి. వీటిని తొలగించేందుకు ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కె.జె.పురం- దబ్బకుంట రహదారిలో భారీగా పెరిగిన మొక్కలు

పొంగిన గెడ్డలు



ఉధృతంగా ప్రవహిస్తున్న పాలగెడ్డ

మాడుగుల రూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో తాచేరు, పాలగెడ్డ, చింత గెడ్డ, శారద, పెద్దేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నది పరీవాహక ప్రాంతంలో గల వరి, ఇతర పంటలు నీటి ముంపునకు గురవుతున్నాయి. వరదగట్లు కూడా కోతకు గురవుతున్నాయి. తాచేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

అధ్వానంగా పీహెచ్‌సీ రోడ్డు



రాళ్లుతేలిన రోడ్డు

కె.కోటపాడు : మండలంలో లంకవానిపాలెం పీహెచ్‌సీకి వెళ్లే మార్గం ఛిద్రమైంది. రాళ్లు పైకి తేలడంతో పాటు గోతులు పడడంతో పాదచారులు, వాహనాలపై ప్రయాణించే వారు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు జరపాలని స్థానికులు కోరుతున్నారు.

వరిపంటకు తెగుళ్ల బెడద



పంటలకు ఆశించిన దోమపోటు

కె.కోటపాడు : వరిపంట పొట్ట దశకు చేరుకుంటున్న సమయంలో తెగుళ్ల వ్యాపిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మేడిచర్ల, గొండుపాలెం, గరుగుబిల్లి, పైడంపేట, కె.కోటపాడు, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో దోమపోటు, ఆకుముడత, కాండం తొలిచే పురుగు ఆశించాయి. వీటి నివారణకు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచనలను చేశారు. దోమపోటు నివారణకు ఎకానికి 120 గ్రాముల పైమెట్రిజోన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి, మొదళ్లు బాగా తడిచినట్లు పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలిచే పురుగు, ఆకుముడత నివారణకు క్లోరాన్ట్రనిలిప్రోల్‌ను ఎకరానికి 60 ఎంఎల్‌ను పిచికారీ చేయాలని తెలిపారు. పాముపొడ ఆశించినట్టయితే ఎకరానికి హెక్సాకోనజోల్‌ను 400 మిల్లీలీటర్లను పిచికారీ చేయాలని తెలిపారు. సస్యరక్షణ చర్యలు చేపట్టిన తరువాతనే యూరియా వేయాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.

వీజే పురంలో 60 మందికి వైద్య పరీక్షలు



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రామ కొండలరావు, జయరాం

మాడుగుల: మండలంలోని వి.జె.పురంలో భానోదయ స్వచ్ఛంద సంస్థ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 60 మందికి తగరపువలస ఎస్ఆర్‌వి ఆస్పత్రికి చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.వారిలో 30 మందికి కళ్లు,గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స నిమిత్తం ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా భానోదయ సంస్థ వ్యవస్థాపకుడు రామ కొండలరావు మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి తగిన సాయం చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరాం, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మనోహర్, శ్రావణి పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



తాండవలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం: తాండవలో ఈనెల 7వ తేదీన జరగనున్న నల్లకొండమ్మ తల్లి పండగ సందర్భంగా నిర్వహించే ఆటలు పోటీలను ఎస్ఐ వై.తారకేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండగల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి, ఇలాంటి టోర్నమెంట్లు ఏర్పాటు చేసుకోవడం చాలా మంచి పరిణామమన్నారు. అనంతరం నాతవరంలో ఈనెల 7న గుర్రపు పరుగు పందాలు నిర్వహించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో అన్ని పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రోలుగుంటలో గౌరీ పరమేశ్వర్ల ఉత్సవం



గౌరీపరమేశ్వరులు విగ్రహం



వీధిలో ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు



గౌరీపరమేశ్వర్లను ఊరేగించేందుకు సిద్ధం చేసిన రథం

రోలుగుంట: మండలకేంద్రం రోలుగుంటలో సోమవారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మునసబు వర్గీయులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ మూర్తులు, ఊరేగింపు రథాన్ని సిద్ధం చేశారు. గౌరమ్మ ఆలయం నుంచి బజారు రోడ్డు వరకు, ఆలయ పరిసర వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, మడ్డు చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ ఇలవేల్పు అయిన గౌరీపరమేశ్వరులను సోమవారం రాత్రి రథంపై ఊరేగించనున్నట్టు చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



కోటవురట్లలో సందల్ ఊరేగింపులో ముస్లిం యువకులు



గుర్రాలకు చందనం పూసి అలంకరించి ఊరేగిస్తున్న దృశ్యం

కోటవురట్ల/నక్కపల్లి: గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో కోటవురట్ల ముస్లిం కాలనీలో శనివారం ప్రారంభమైన ఈ వేడుకలు ఆదివారం కూడా కొనసాగాయి. మసీదు ఉస్మాన్ ఘని నుంచి సందల్ ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు, యువకులు గ్రామ వీధుల్లో శాంతి ర్యాలీ చేశారు. అనంతరం గౌస్ పాక్ నిషానీ వద్ద సలాతు సలాం, ఫాతెహా, దరూద్ నిర్వహించి సర్కార్ గౌస్ పాక్ జెండాను ఆవిష్కరించారు. నక్కపల్లి మండలం పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, చిన బోదిగల్లం, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో మసీదులను సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. గుర్రాలను సైతం అలంకరించి వీధుల్లో ఊరేగించారు. వాటికి చందనం పూసి ఐదు గ్రామాల ముస్లింలు ఒకచోట చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాజువాక, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా స్వగ్రామాలకు చేరుకుని పండగ జరుపుకున్నారు.



విద్యుద్దీపాలంకరణతో మసీదు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లకొండమ్మ తల్లి

- 7న ఉత్సవం
- రెండు ఉమ్మడి జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు



తాండవ రిజర్వాయర్ గట్టు దిగువన ఉన్న నల్లకొండమ్మ తల్లి ఆలయం



అమ్మవారికి గుడికి వెళ్లే ముఖద్వారం



అమ్మవారి విగ్రహం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన నల్లకొండమ్మ తల్లి పండగను ఈనెల 7వ తేదీన నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తాండవ రిజర్వాయర్ గట్టు దిగువన నల్లకొండమ్మ తల్లి ఆలయం వద్ద పండగను ప్రతి ఏటా అక్టోబరు నెలలో నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవం సందర్భంగా అమ్మవారి దర్శనానికి ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈపండగను భక్తిశ్రద్ధలతో చేస్తే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత రైతుల నమ్మకం.

అమ్మవారి ఆలయ చరిత్ర ఇదీ...

పూర్వం కొండపై భారీ వృక్షం నీడలో అమ్మవారు కొలువుండేదని అంటారు. ప్రతీ సంవత్సరం అక్కడే పండగ నిర్వహించేవారు. అయితే పండగ అనంతరం నాయీబ్రాహ్మణుడిని ఆవహించిన అమ్మవారు తనకు కొండ దిగువన ఆలయం నిర్మించాలని సూచించారు. ఆ మేరకు ప్రస్తుత తాండవ రిజర్వాయర్ దిగువ గట్టు మీద గ్రామస్తులు ఆలయం నిర్మించారు. అప్పటికి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాలేదు. అప్పటి నుంచి ఈ ప్రాంతీయులు అపారమైన నమ్మకంతో అమ్మవారికి పూజలు చేస్తున్నారు. తాండవ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తరువాత 1974లో మొదటి సారి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, గేట్లు ఎత్తి కాలువల ద్వారా ఆయకట్టుకు నీరువిడుదల చేశారు. అనంతరం ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో ముందుగా అమ్మవారికి పూజలు చేసి, అనంతరం నీరు విడుదల చేయడం ఆనవాయితీగా మారింది.

ఘనంగా శూలాల మహోత్సవం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో దుర్గాదేవి శూలాల మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి మాలలు ధరించిన పలువురు భక్తులు శూలాలు ధరించి అగ్నిగుండం తొక్కారు. శూలాలతో భక్తులు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. శూలాలతోపాటు అగ్నిగుండం తొక్కే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. జై దుర్గా నామస్మరణతో వాడ్రాపల్లి మార్మోగింది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



నిందితుడితో పెందుర్తి పోలీసు సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పార్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రిగెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్ఐ ఎస్‌వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ భాస్కరరావు వెల్లడించారు.

PUBLIC NOTICE

Notice is hereby given to the public at large that **Sri Lanka Veerraju, S/o. Takkayya, residing at STBL Women's Vignan College, near Laxmi Manohar Garden, Visakhapatnam**, is proposing to purchase an extent of **Ac. 5.75 cents of dry land with cashew tope** situated at **Bhoorugupalem Revenue Village, Makavarapalem Mandal, Anakapalli District**, from **Sri Adapureddy Srinivas and Sri Adapureddy Sai Ganesh, sons of Sri Bennayya Naidu, residents of Balighattam Village, Narsipatnam Municipality, Anakapalli District.**

The said property is more fully described as follows:
Survey Numbers: 267/1, 267/2, 267/3, 267/4, 267/6, 267/7, 267/8, 267/9, 267/11.
Extent: Ac. 0.05 3/4 cents (5.75 cents) of dry land.
Village: Bhoorugupalem, **Mandal**: Makavarapalem, **District**: Anakapalli.

Any person/s having any claim, right, title, interest, share, lien, mortgage, lease, charge, encumbrance or any manner of objection whatsoever in respect of the aforesaid property are hereby called upon to make such claims/ objections in writing, along with supporting documents, to the undersigned within **15 days** from the date of publication of this notice.

If no claim/ objection is received within the stipulated period, the said transaction will be completed, and no person thereafter shall have any right to object to the same.

Sd/- **(Lanka Veerraju)**
Proposed Purchaser.
Ph: 9866770077, 7993544388, 9849915167
Through Counsel
[Sri C.G. Prasad & V.Ramaraju]
Advocates, Narsipatnam. Ph: 8341617606
V.RAMARAJU, M.A., B.L., Advocate
Opp. Kanyakaparameswari Temple, Turakabadi Street, Narsipatnam. Cell: **8341617606**